# పాపం పసివాడు!

తెల్లవారుఝామున... నాలుగింటికి.

రోడ్డు మీదికున్న కిటికీదగ్గర టేబిల్లైటు వేసుకు, టేబిల్ ముందు కుర్చీలో ఏదో రాసుకుంటూనో, చదూకుంటూనో కూర్చోవటం నా డెయిలీరొటీన్.

సరిగా అదే సమయానికి సీసాలు గలగల చప్పుడు చేసుకుంటూ పాల వ్యాను మా గుమ్మంముందు నుంచి 'బూత్' కి వెళ్తుంది.

అదీ అలా వెళ్ళిన పదిహేను ఇరవై నిమిషాలకల్లా, ఓ ఇరవై ఏళ్ళ కుర్రాడు— గట్టిగా కాళ్ళను ఎడం జాపి, కాస్త ముందుకి వంగి నించుంటే ఎక్కడ వెనకపట్టున పిగిలిపోతుందో అనిపించేలా ఒంటికి అంటుకుపోయి, కాలి శీలమండల కిందికి దిగని గొట్టాం ప్యాంటూ, అంత మరీ పట్టినట్లు కాకుండా, అంత మరీ ఒదులుగా లేకుండా, అవ్వాలు తొడుక్కునే రవిక చతుల్లా వున్న చేతుల్తో నడుం దిగీ దిగని బొమ్మల అమెరికన్ శ్లాకూ, తలమీద యీ చెంపా, ఆ చెంపా, చెవులమీద ఇంత జుట్టు పడుతూ, ముక్కుకి సూటిగా నడి నుదురు పైభాగాన్న అంత ఎత్తుకి లేచి, టాంగా టాపులా ముందుకిపడేలా దువ్వుకున్న క్రాఫింగూ, కాళ్ళకు ఆకు చెప్పులూ—సంగ్రహంగా ఇదీ ఆ కుర్రాడి రూపం— ప్లాస్టిక్ బ్యాగ్ లో నాలుగు పాలసీసాలు పేర్చుకుని యీల వేసుకుంటూ, మా యింటి కెదురుగా వున్న ఇంటివైపు పదేపదే చూసుకుంటూ మిల్కుబూత్ నుంచి ఆ దారిన పోతూండటం— ఇలా వారం పదిరోజులనుంచీ జరుగుతోంది.

ఈ వారం పదిరోజులూ నే నా కుర్రాణ్ని చూస్తూనే ఉన్నాను. వాడు వేస్తూన్న ఈలను వింటూనే ఉన్నాను. వాడు చూస్తూన్న చూపుల్ని గమనిస్తూనే వున్నాను. అయినా, అదేవిటోగాని, ఏ ఒక్కనాడూ ఆ కుర్రాడు నా దృష్టిలో తనని గురించి నాచేత ఆలోచింప చేసేటంత ప్రత్యేకమైన స్థానాన్ని ఏమీ చేసుకోలేదు. రోజూ పాల వ్యానుని ఎంత యాంత్రికంగా చూస్తున్నానో, ఆ కుర్రాణ్ని కూడా అంతే యాంత్రికంగా చూస్తున్నాను.

దానికి కొన్ని కారణాలు కూడా లేకపోలేదు.

హైదరాబాద్ నగరంలో, ఆ వయసు కుర్రాళ్లు అలాంటి వేషంతో, ఈలలూ అవీ వేసుకుంటూ, రోడ్డుమీద పడివున్న ఆ చెత్తనూ, యీ చెత్తనూ కాలితో తన్నుకుంటూ ఆవారా సినిమాలో హీరోలా— పోతూండటంలాంటి ఈ దృశ్యాలు పురజనులకు మామూలే!

రోజూలాగే ఆవేళ కూడా ఆ

అవసరాల నారాయణరావ్

కుర్రాడు అలా యీల వేసుకుంటూ, మా ఎదురింటి వైపు పదేపదే చూసుకుంటూ, పాలసీసా ఉన్న ప్లాస్టిక్ సంచీ పట్టుకుని వస్తున్నాడు.

ఏదో రాసుకుంటూన్న వాణ్ణిల్లా చటుకున తలెత్తి చూశా యీల విని.

ఈమాటు ఎందుకోగాని, అప్రయత్నంగానే ఆలోచించాను, ఎందుకీ కుర్రాడు యిలా చేస్తున్నాడా? అని.

కాని, ఆ కుర్రాడు నా కర్థం కాలేదు. 'ఫలానా' 'ఫలానా' అని వాడి ధోరణికి ఆపాదించగల ప్రత్యేకమైన కారణాలేవీ నాకు కనిపించలేదు. 'ఊఁ...మన కెందుకు లెద్దూ!' అన్న ధోరణిలో సరిపెట్టుకు వూరుకున్నాను

మూడు నాలుగు రోజులైంది.

ఆ వేళ...మామూలు టైముకి నేను చేతిలో టీ వేసుకుని, కిటికీదగ్గరకూర్చోవటం, పాలవ్యాన్ వచ్చి వెళ్ళటం యథావిధంగా జరిగింది

నాలుగూ ఇరవై నిముషాలైంది.

మా ఎదురింటికి ప్రక్కనే...రోడ్డు మలుపులో యీల వినిపించింది.

నేను తలెత్తి అటు చూశాను.

ఆ కుర్రాడే!

అంతవరకూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ఏదో హడావిడిగా వచ్చిన ఆ కుర్రాడు మా ఎదురింటి వాళ్ళ కాంపౌండు దగ్గిర కొచ్చేసరికి అడుగులో అడుగులు వెయ్యటం మొదలు పెట్టాడు! ఈలనాదం కొంచెం పెద్దది చేశాడు! ఇంటివైపు తల ఎత్తి ఎత్తి మరీ చూడటం మొదలుపెట్టాడు!

తక్కున లైటు వెల్గింది ఎదురింట్లో!

ఈ మాటు ఆ కుర్రాడు మరింత హుషారుగా యీల వేసుకుంటూ, వేగం పెంచి నడుస్తున్నాడు!

వీధి తలుపు తీస్తోన్న చప్పుడైంది.

ఆ కుర్రాడు మరింత హుషారైపోయాడు. ఈలనాదం, కాలినడక వేగంకూడా రెట్టింపయ్యాయ్!

ఆ కుర్రాడు కాంపౌండు గేటు దగ్గిర కొచ్చాడు.

అంతలోనే యింట్లోంచి, నెత్తి మీది ముసుగును కొంచెం నుదురు మీదికి లాక్కుంటూ ఒక అవ్వగారు కూడా అదే సమయానికి అక్కడికి వచ్చింది చటుక్కున యీల ఆపేశాడు కుర్రాడు.

"ఏం నాయనా! ఆపేశావ్ ?"

ఒక్కసారిగా గతుక్కుమన్నాడు కుర్రాడు.

"ఇక్కేలే ఆ వారం పదిరోజులూ పాల బూత్ కొచ్చిన మామనుమరాలు వాళ్ళ వూరి కెళ్ళిపోయింది నాయనా!...

అయినా ఫర్వాలేదులే!...నీ ఈల వినిపించీ వినిపించగానే - వేణునాదం విని గోపాలకృష్ణుడి దగ్గరకి గోపికల్లా ఉరుక్కుంటూ నేను వస్తాగా!..."

వ్యాన్ మాత్రం ఎప్పట్లా రోజూ మామూలుగానే వస్తోంది మరి!...

కానీ యీలే...!?